10న విక్రవాండి ఉపఎన్నిక

చెన్నై, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా విక్రవాండి నియోజకవర్గం ఉప ఎన్నిక జూలై 10వ తేదీ జరుగనుంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ప్రకటన విడుదల చేసింది. విక్రవాండి ఎమ్మెల్యే, విల్లుపురం మధ్య జిల్లా డీఎంకే కార్యదర్శి పుహళేంది ఏప్రిల్ 5వ తేది ముఖ్యమంత్రి స్టాలిన్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రచారసభలో పాల్గొని హఠాత్తుగా స్పృహతప్పి పడిపోయిన విషయం తెలిసిందే. ఆయన్ని వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ 6వ తేది మృతిచెందారు. ఎమ్మెల్యే పుహళేంది మృతి విషయాన్ని శాసనసభ కార్యదర్శి ఎన్నికల సంఘానికి 8వ తేది సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో, పార్లమెంటు ఎన్నికలు ఏడు విడతలుగా ఈ నెల 1వ తేది వరకు జరిగిన విషయం తెలిసిందే. ఏడో విడత పార్లమెంటు ఎన్నికలతో పాటు విక్రవాండి ఉప ఎన్నిక కూడా జరుగుతుందని భావించినా, నిర్వహణ కారణాల రీత్యా ఎన్నికల సంఘం ఉప ఎన్నిక తేదీ ప్రకటించలేదు. ఈ నేపథ్యంలో, ఖాళీ అయిన అసెంబ్లీ నియోజకవర్గానికి ఆరు నెలల్లో ఎన్నికలు నిర్వహించాలనే నిబంధన ఉండడంతో, దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న 13 శాసనసభ నియోజకవర్గాల ఉప ఎన్నిక తేదీని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఆ ప్రకారం విక్రవాండి ఉప ఎన్నికల జూలై 10వ తేది జరుగనుంది. ఈ నెల 14 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమై 21వ తేదీతో ముగియనుంది. 24న నామినేషన్ల పరిశీలన జరుగనుండగా, 26వ తేది వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. జూలై 10వ తేది పోలింగ్ నిర్వహించి, 13వ తేది ఓట్ల లెక్కింపు జరుగనుంది.

ఆ నియోజకవర్గంలో అమల్లోకి ఎన్నికల కోడ్



ఈవీఎంలు సిద్ధం: ఎన్నికల ప్రధాన అధికారి

విక్రవాండి శాసనసభ నియోజకవర్గం ఉప ఎన్నికకు కొత్త ఈవీఎంలు వినియోగించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రదసాహు తెలిపారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ... విక్రవాండి ఉప ఎన్నికకు అవసరమైన ఈవీఎంలు సిద్ధంగా ఉన్నాయన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంలను ఉప ఎన్నికలో వినియోగించబోమని స్పష్టం చేశారు. ఆ నియోజకవర్గంలో సోమవారం నుంచే కోడ్ అమలులోకి వచ్చిందని, అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు నిర్వహించరాదన్నారు. ప్రభుత్వం తరపున ఎలాంటి కొత్త పథకాలు గానీ, ప్రకటనలు గానీ జారీ చేయరాదన్నారు. ఎన్నికల ఫలితాలు జూలై 13వ తేదీన వెలువడిన మరుసటి రోజు నుంచి కోడ్ ఎత్తి వేస్తామన్నారు. విక్రవాండి ఉప ఎన్నికల్లో ఓటర్లకు సిరా చూపుడు వేలుకు కాకుండా మధ్య వేలుకు వేస్తామని వివరించారు.

డీఎంకేకు మద్దతు

టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై

విక్రవాండి ఉప ఎన్నికల్లో డీఎంకేకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై ప్రకటించారు. నగరంలో సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ... ఈ స్థానం నుంచి డీఎంకే ఎమ్మెల్యే విజయం సాధించారని, ఆయన మృతితో జరుగనున్న ఉప ఎన్నికల్లో డీఎంకే అభ్యర్థి విజయానికి తమ పార్టీ నేతలు, కార్యకర్తలు కృషిచేస్తారని తెలిపారు.

మంత్రివర్గంలో మార్పులు లేనట్లే?!



సీఎం స్టాలిన్

ప్యారీస్, జూన్ 10: రాష్ట్ర మంత్రివర్గంలో మార్పులు చేర్పులు జరిగే అవకాశముందంటూ రేగుతున్న పుకార్లకు బ్రేక్ పడినట్లే కనిపిస్తోంది. లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలకు సంబంధించిన 40 స్థానాల్లో డీఎంకే కూటమి అభ్యర్థులు ఘనవిజయం సాధించడంతో రాష్ట్ర మంత్రివర్గంలో ఎలాంటిమార్పులు ఉండబోవని అధికారపార్టీ వర్గాలు చెబుతున్నాయి. 18వ లోక్‌సభకు ఏప్రిల్ 19వ తేది జరిగిన ఎన్నికల్లో డీఎంకే కూటమిలోని అభ్యర్థులందర్నీ గెలిపించే బాధ్యతను మంత్రులు, పార్టీ జిల్లా కార్యదర్శులకు ముఖ్యమంత్రి స్టాలిన్ అప్పగించారు. సుమారు రెండు నెలలు వారికి కేటాయించిన నియోజకవర్గాల్లో మకాంవేసి మిత్రపక్షాల స్థానిక నేతలు, కార్యకర్తలను సమన్వయం చేసుకొని డీఎంకే ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేశారు. ఏ నియోజకవర్గంలోనైనా కూటమి అభ్యర్థులు ఓటమి పాలైతే పార్టీపరంగా చర్యలుంటాయని డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ నియోకజవర్గ ఇన్‌ఛార్జులకు హెచ్చరించారు. దీంతో మంత్రులు, పార్టీ జిల్లా కార్యదర్శులు ఎన్నికల ప్రచారం ముగిసే వరకు రేయింబవళ్లు ఆయా నియోజకవర్గాల్లో సైనికుల్లా పనిచేశారు. ఎట్టకేలకు ఈ నెల 4వ తేది వచ్చిన ఫలితాల్లో తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో ఉన్న 40 నియోజకవర్గాల్లో డీఎంకే కూటమి అభ్యర్థులు ఊహించని విధంగా భారీ మెజార్టీతో గెలిచారు. దీంతో, డీఎంకే నియోజకవర్గ ఇన్‌చార్జుల్లో నూతనోత్సాహం వెల్లుబుకుతోంది. అభ్యర్థులందర్నీ గెలిపించిన మంత్రులు, జిల్లా కార్యదర్శులను సీఎం స్టాలిన్ పార్టీ కార్యాలయానికి ఆహ్వానించి అభినందించారు. అత్యధిక మెజార్టీ వచ్చిన నియోజకవర్గాల పార్టీ నిర్వాహకులకు కీలక పదవులు కేటాయించేందుకు స్టాలిన్ నిర్ణయం తీసుకున్నారని, లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమి సాధించిన విజయం వల్ల రాష్ట్ర మంత్రివర్గంలో ఎలాంటి మార్పులకు అవకాశముండబోదని అన్నా అరివాలయ వర్గాల సమాచారం.

విద్యార్థులకు రెండు విడతలుగా ప్రోత్సాహకాల పంపిణీ



టీవీకే అధ్యక్షుడు విజయ్

చెన్నై, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) ఆధ్వర్యంలో విద్యార్థులకు రెండు విడతలుగా ప్రోత్సాహకాలు అందించనున్నట్లు ఆ పార్టీ అధ్యక్షుడు, నటుడు విజయ్ ప్రకటించారు. గత ఏడాది 10, 12వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో రాష్ట్రంలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా మంచి మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి, సర్టిఫికెట్లను నటుడు విజయ్ అందజేసిన విషయం తెలిసిందే. సుమారు 12 గంటల పాటు సాగిన ఈ కార్యక్రమం పూర్తయ్యే వరకు విజయ్ నిలబడే విద్యార్థులకు ప్రోత్సాహకాలు పంపిణీ చేశారు. అలాగే, అందరితో వేర్వేరుగా సెల్ఫీ కూడా తీసుకున్నారు. విజయ్ సొంతఖర్చుతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆ ప్రకారం, ఈ ఏడాది కూడా పబ్లిక్ పరీక్షల్లో మార్కులు సాధించిన వారికి రెండు విడతలుగా నటుడు విజయ్ ప్రోత్సాహకాలు అందించనున్నారు. ఆ ప్రకారం, తొలివిడతగా ఈ నెల 28వ తేది తిరువాన్మియూర్‌లోని రామచంద్ర కన్వెన్షన్ సెంటర్‌లో అభినందన సభ జరుగనుంది. ఈ సభలో అరియలూరు, కోయంబత్తూర్, ధర్మపురి, దిండుగల్, ఈరోడ్, కన్నియాకుమారి, కరూర్, కృష్ణగిరి, మదురై, నామక్కల్, నీలగిరి, పుదుకోట, రామనాధపురం, సేలం, శివగంగ, తెన్‌కాశి, తేని, తూత్తుకుడి, తిరునల్వేలి, తిరుప్పూర్, విరుదునగర్ తదితర జిల్లాలకు చెందిన విద్యార్థులను నటుడు విజయ్ అభినందించనున్నారు. అలాగే, రెండో విడతగా జూలై 3వ తేది చెంగల్పట్టు, చెన్నై, కడలూరు, కళ్లకుర్చి, కాంచీపురం, కారైక్కాల్, మైలాడుదురై, నాగపట్టణం, పెరంబలూరు, పుదుచ్చేరి, రాణిపేట, తంజావూరు, తిరువళ్లూర్, తిరువణ్ణామలై, తిరువారూరు, తిరుపత్తూర్, తిరుచ్చి, వేలూరు, విల్లుపురం తదితర జిల్లాల విద్యార్థులకు నటుడు విజయ్ ప్రోత్సాహకాలు అందించి అభినందించనున్నారు.

విద్యార్థులకు మరిన్ని రాయితీలు

మంత్రి అన్బిల్ మహేష్ ప్రకటన

ప్యారీస్, జూన్ 10: విద్యార్థులకు త్వరలోనే ముఖ్యమంత్రి స్టాలిన్ మరిన్ని కొత్త రాయితీలను ప్రకటించనున్నారని విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోస్టల్ సేవింగ్స్ అకౌంట్ ప్రారంభోత్సవం, పాఠశాలలోనే ఆధార్ నమోదు ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఆలందూర్ ఏజేఎస్ నిధి మహోన్నత పాఠశాల ప్రాంగణంలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఇందులో మంత్రి అన్బిల్ మహేష్ పాల్గొని కొత్త పథకాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు సోమవారం పునఃప్రారంభమయ్యాయని, తొలిరోజే ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు అందజేశామన్నారు. ఈ నెల 24న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతాయని, ఈ సమావేశాల్లో విద్యార్థులు లబ్ధిపొందే విధంగా మరిన్ని కొత్త పథకాలను సీఎం స్టాలిన్ ప్రకటిస్తారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలుపరుస్తున్న పథకాలను దశలవారీగా ఎయిడెడ్ పాఠశాలలకు కూడా విస్తరింపజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా వారికి క్రీడలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, సాహిత్యం, పర్యావరణ పరిరక్షణ తదితర రంగాల్లో రాణించేలా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి కుమరగురుపరన్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థికి బ్యాంక్ ఖాతా పుస్తకం అందజేస్తున్న మంత్రి అన్బిల్ మహేష్



తొలిరోజు అసెంబ్లీ సమావేశంలో విద్యార్థినులు

మారాం చేసిన పిల్లలు... బుజ్జగించిన తల్లిదండ్రులు

పెరంబూర్, జూన్ 10: బడికి వెళ్లబోమంటూ మారాం చేస్తున్న పిల్లలు.. వారిని బుజ్జగించే తల్లిదండ్రులు.. తరగతి గదుల్లో చిన్నారుల ఏడుపులు, పెడబొబ్బల దృశ్యాలు.. సోమవారం పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా కనిపించిన దృశ్యాలు. వేసవి సెలవుల అనంతరం సోమవారం ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 6 నుంచి పాఠశాలలు ప్రారంభమవుతాయని తొలుత ప్రభుత్వం ప్రకటించినా, ఎండ తీవ్రత కారణంగా ఈ నెల 10వ తేదీకి వాయిదాపడింది. పాఠశాలల ప్రారంభానికి ముందే తరగతి గదులు, మైదానం, వాటర్ ట్యాంకులు తదితరాలు శుభ్రం చేయించారు. పాఠశాలలను అరటి, మామిడి తోరణాలు, బెలూన్లతో అందంగా అలంకరించారు. సోమవారం విద్యార్థులు పాఠశాలకు వచ్చే సమయంలో ప్రవేశద్వారం వద్ద ఉపాధ్యాయులు వారికి పూలు, చాక్లెట్లు అందజేయగా, కొన్ని పాఠశాలల్లో చక్కెర పొంగలితో

పాఠశాలల్లో ప్రారంభమైన సందడి

విద్యార్థులను ఆహ్వానించారు. ఎప్పటిలాగే పాఠశాలలో ఉదయం అసెంబ్లీ నిర్వహించి తమిళ తాయ్ వాళ్త, జాతీయ గీతాలాపన జరిగింది. అలాగే, తరగతి గదిలో ఎలా నడుచుకోవాలి సహా పలు విషయాలపై అధ్యాపకులు అసెంబ్లీలో విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం తరగతి గదిలోకి ప్రవేశించిన విద్యార్థులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదే సమయంలో, పాఠశాల ఇదివరకే ప్రకటించిన విధంగా, పాఠశాలల్లోనే ఆధార్ నమోదు కేంద్రాల ఏర్పాటుచేసి, విద్యార్థుల ఆధార్ నెంబరు నమోదు, కొత్త ఆధార్ కార్డుకు దరఖాస్తులు తదితరాలను ఉపాధ్యాయులు పూర్తిచేశారు. అలాగే, పాఠశాల ప్రారంభం రోజునే సుమారు 70 లక్షల మంది ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలతో పాటు చరిత్ర మ్యాప్‌లు అందజేశారు. కాగా, పాఠశాలలు ప్రారంభించిన తొలిరోజే ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలకు సుమారు 80 లక్షల మంది విద్యార్థులు వచ్చారని పాఠశాల విద్యాశాఖ తెలియజేసింది.



విద్యార్థులకు ఆధార్ నమోదుచేస్తున్న దృశ్యం

విద్యార్థులకు సీఎం స్టాలిన్ శుభాకాంక్షలు

ప్యారీస్, జూన్ 10: వేసవి సెలవుల అనంతరం సోమవారం పాఠశాలలకు వెళ్లిన విద్యార్థినీ, విద్యార్థులకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన తన ఎక్స్ పేజీలో... ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అన్ని శుభాలే జరుగుతాయని, ఇందుకోసం రాష్ట్రప్రభుత్వం కొత్త పథకాలను తీసుకొస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సెలవుల అనంతరం మళ్లీ తరగతి గదుల్లో అడుగుపెడుతున్న విద్యార్థినీ, విద్యార్థులు ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. చదువుల్లో, క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించి వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని ఆశిస్తున్నట్లు సీఎం తన ఎక్స్ పేజీలో తెలిపారు.

పుదుచ్చేరి బీజేపీలో ముసలం



బీజేపీ అధ్యక్షుడు సెల్వగణపతి



మాజీ అధ్యక్షుడు స్వామినాథన్

ప్యారీస్, జూన్ 10: లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసిన బీజేపీ అభ్యర్థి, పుదుచ్చేరి మంత్రి నమశ్శివాయం ఓటమి పాలవడంతో ఆ రాష్ట్రంలోని బీజేపీలో నేతలమధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. నమశ్శివాయం ఓటమికి బాధ్యత వహించి పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవికి సెల్వగణపతి రాజీనామా చేయాలని మాజీ అధ్యక్షుడు స్వామినాథన్ డిమాండ్ చేశారు. దీనిపై స్వామినాథన్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ... పుదుచ్చేరి రాష్ట్రంలో పదేళ్లుగా బీజేపీని బలపరిచేందుకు సభ్యత్వ నమోదు ప్రక్రియ వేగవంతం చేశామని, నగర ప్రాంతాల నుంచి మారుమూల పల్లెల్లో కూడా పార్టీకి విశ్వాసంగా పనిచేస్తూ ఏకాభిప్రాయంతో ఉన్న వారినే నిర్వాహకులుగా నియమించినట్లు తెలిపారు. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరపున ఆరుగురు ఎమ్మెల్యేలు మొట్టమొదటిసారిగా ఎంపికయ్యారని, మూడేళ్లుగా కూటమి ప్రభుత్వానికి తమ వంతు సహకారం అందిస్తూ వస్తున్నట్లు తెలిపారు. దీర్ఘకాలంగా ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీ పోస్టులను పారదర్శకంగా భర్తీచేయించేందుకు తాను ఎంతగానో కృషిచేశానని ఆయన వాపోయారు. అయితే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓటమికి తానే బాధ్యుడునని అంగీకరించి పార్టీ అధ్యక్ష పదవికి సెల్వగణపతి రాజీనామా చేయాలని స్వామినాథన్ పట్టుబట్టినట్లు తెలిసింది. ఇందుకు అంగీకరించిన సెల్వగణపతి ఎన్నికల్లో గెలుపోటములు సహజమేనని, పార్టీ ఓటమికి గల కారణాలపై అధిష్ఠానం సమీక్షించాల్సిన అవసరం ఉందని, స్వామినాథన్ డిమాండ్ మేరకు తాను పదవి నుంచి తప్పుకోవాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు.



ప్రభుత్వ పథకాలతో వాట్సాప్ ఛానల్

పెరంబూర్, జూన్ 10: రాష్ట్ర ప్రభుత్వ పథకాలు గురించి తెలుసుకొనేలా సమాచార శాఖ 'వాట్సాప్' ఛానల్ ప్రారంభించింది. ఈ మేరకు సచివాలయం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రప్రభుత్వ పథకాలు ప్రజలు తెలుసుకొనేలా, ఒక్కో శాఖ సోషల్ మీడియాలో ప్రత్యేక యాప్ ప్రారంభించి, ఆయా శాఖల పథకాలు, పనితీరు తెలియజేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, పౌర సంబంధాల శాఖ ద్వారా ఈ-మెయిల్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ పేజీలు, యూ ట్యూబ్ ప్రారంభించగా, తాజాగా ప్రజలంతా సులభంగా ప్రభుత్వ పథకాల సమాచారం తెలుసుకొనేలా వాట్సాప్ ఛానల్ ప్రారంభించింది. ఆ ప్రకారం, 'TNDIPR, Govt.of Tamilnadu' అనే పేరుతో వాట్సాప్ ఛానల్‌ను రాష్ట్రప్రభుత్వం ప్రారంభించింది. ప్రజలు ఈ వాట్సాప్ ఛానల్‌లోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ప్రభుత్వ పథకాలు తెలుసుకోవచ్చని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలియజేసింది.

సమాచార దృశ్యని

ఉచిత భగవద్గీత తరగతులు

ఐసిఎఫ్, జూన్ 10: ఇస్కాన్ ఆధ్వర్యంలో 18 రోజులు ఉచిత భగవద్గీత ఆన్‌లైన్ తరగతులు జరగనున్నాయి. ప్రతి గురు, ఆదివారాలు రాత్రి 8 నుంచి 9 గంటల వరకు 18 రోజులు 18 పర్యాలు తమిళంలో ఈ తరగతులు ఈ నెల 16వ తేదినుంచి ప్రారంభం కానున్నాయి. వివరాలకు https://chat.whatsapp.com/J3rOxm5eeEO6RkVegunoSD అనే వెబ్‌సైట్, 7358511132 అనే వాట్సాప్ నెంబరును సంప్రదించాలని ఇస్కాన్ పేర్కొంది.

వర్షాకాలంలోగా కాలువలు పూర్తిచేయాలి

ఐసిఎఫ్, జూన్ 10: వాననీటి కాలువల నిర్మాణపనులు రుతుపవన వర్షాలకు ముందే పూర్తిచేయాలని ఒప్పంద దారులకు చెన్నై కార్పొరేషన్ ఆదేశించింది. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల సీజన్ ఈ నెలాఖరు, జూలై మొదటి వారంలో ప్రారంభమయ్యే అవకాశముంది. ఈలోగా పలు ప్రాంతాల్లో జరుగుతున్న వాననీటి కాల్వల నిర్మాణాలు త్వరలో ముగించాలని ఒప్పంద సంస్థలకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఐదు నెలల్లో 20 ఏనుగుల మృతి

ఐసిఎఫ్, జూన్ 10: రాష్ట్రంలో జనవరి నుంచి మే నెల వరకు 20 ఏనుగులు మృతిచెందాయని అటవీ శాఖ అధికారులు తెలిపారు. పశ్చిమ కనుమలను ఆనుకొని ఉన్న జిల్లాల్లో అడవి ఏనుగుల సంఖ్య పెరుగుతోంది. ఒక్కో ప్రాంతంలో అటవీ శాఖ ఏనుగుల గణన చేపడుతోంది. గత ఏడాది దక్షిణాదిలోని నాలుగు రాష్ట్రాల్లో నిర్వహించిన గణనలో 2,961 ఏనుగులున్నట్లు గుర్తించారు. ఏనుగులు ఆహారం, నీటి కోసం దూరప్రాంతాలకు వెళ్తుంటాయి. అలా వెళ్లే మార్గాల్లో ఏనుగులు మరణిస్తున్నాయి. ఈ ఏడాది ఏనుగుల గణన మే నెలలో జరిగింది. ఈ విషయమై అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ... ఏనుగుల మరణాలకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు సేకరించి కారణాలు పరిశీలిస్తున్నామన్నారు. జనవరి నుంచి మే వరకు 20 ఏనుగులు మృతిచెందాయని, ఇవి సహజ మరణాలుగా నమోదయ్యాయన్నారు. ఈరోడ్ జిల్లా సత్యమంగళం పులుల శరణాలయం, పరిసర ప్రాంతాల్లో ఆరు, ముదుమలై పులుల శరణాలయం, చుట్టుపక్కల ప్రాంతాల్లో తలా ఐదు ఏనుగులు మృతిచెందాయని, ఈ మరణాలకు సంబంధించి విచారణ జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జూన్ 10: విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

వేళచ్చేరి: విజయా నగర్, సారథి నగర్, విజయా నగర్ జంక్షన్, సీతారామ్‌నగర్, డీపీ ఎన్‌క్లేవ్ కాలనీ, వీజీపీ సెల్వ నగర్, బాలమురుగన్ నగర్

ఎళిల్‌నగర్: కస్తూర్బా నగర్, కర్పగవినాయగర్ 1వ మెయిన్ రోడ్డు, కర్పగవినాయగర్ 6 నుంచి 30వ వీధి, సౌందర్య గార్డెన్ మెయిన్ రోడ్డు

తిరువొత్తియూర్: గుమ్మాలమ్మన్ ఆలయ వీధి, జీపీ రోడ్డు, టీహెచ్ రోడ్డు, సోలయప్పన్ వీధి, కప్పల్‌పోలు వీధి, వీపీ ఆలయ వీధి, తాండవరాయన్ వీధి, శ్రీరంగం వీధి, రామానుజం వీధి, సంజీవిరాయన్ వీధి, సుబ్బరాయన్ వీధి, బాలుమొదలి వీధి, పాత వాషర్‌మెన్‌పేట, ఇలయ వీధి, మన్నప్పన్ వీధి, తంగవేల్ వీధి, నైనియప్పన్ వీధి, పెరుమాళ్ ఆలయ వీధి, వీరాకుట్టి వీధి, కేజీ గార్డెన్, మేయర్ బాసుదేవ్ వీధి

ఐఐటీ: శ్రీరామ్ నగర్, పల్లిపట్టు మెయిన్ రోడ్డు, యతిరాజ్ వీధి, యోగి గార్డెన్, కందస్వామి వీధి

కొట్టివాక్కం: కేకే రోడ్డు, శాస్త్రి నగర్, రెండు, మూడు, నాలుగవ వార్డు బీచ్ రోడ్డు బాలకృష్ణన్ రోడ్డు, రాజారంగస్వామి అవెన్యూ

పెరిగిన ఉల్లి ధర

ఐసిఎఫ్, జూన్ 10: స్థానిక కోయంబేడు మార్కెట్లో దిగుమతులు తగ్గడంతో ఉల్లి ధరలు పెరిగాయి. ఈ మార్కెట్‌కు ప్రతిరోజు 45 లారీల్లో ఉల్లి దిగుమతవుతుండగా, కొన్ని రోజులుగా 30 లారీల్లో మాత్రమే సరఫరా అవుతోంది. ఇటీవల కిలో నాసిక్ ఉల్లి రూ.30కు విక్రయం కాగా, ప్రస్తుతం రూ.42కు పెరిగింది. చిల్లర మార్కెట్లు, సూపర్ మార్కెట్లలో కిలో రూ.55 నుంచి రూ.60 వరకు విక్రయమవుతోంది. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల కారణంగా దిగుబడులు తగ్గాయని, ఈ కారణంగా ధరలు పెరిగాయని వ్యాపారులు తెలిపారు.

జూలైలో పూర్తికానున్న షట్టర్ల మరమ్మతులు

ఐసిఎఫ్, జూన్ 10: పూండి సత్యమూర్తి సాగర్ రిజర్వాయర్ 16 షట్టర్ల మరమ్మతులు జూలై మొదటి వారంలో పూర్తికానున్నాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు. నగర ప్రజల తాగునీటికి ఆధారమైన ఈ రిజర్వాయర్‌ను 1940 నుంచి 1944 సంవత్సరాల కాలంలో నిర్మించారు. 8,458 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ డ్యాం 35 అడుగుల ఎత్తు, 3,231 మిలియన్ ఘనపుటడుగుల సామర్థ్యం ఉంది. కృష్ణా జలాలు చేరేందుకు ఊత్తుకోట జీరో పాయింట్ నుంచి పూండి వరకు 25 కి.మీ కాలువ ఏర్పాటుచేశారు. డ్యాం ఏర్పాటుచేసిన రోజు నుంచి 2019 సంవత్సరం వరకు నాలుగు సార్లు మాత్రమే పూర్తి సామర్థ్యం చేరుకోవడంతో మిగులు జలాలను విడుదల చేసారు. 2015లో లక్ష ఘనపుటడుగుల నీరు విడుదల చేయడం గమనార్హం. ఈ నేపథ్యంలో, గత ఏడాది కురిసిన భారీవర్షాలకు మిగులు జలాలు విడుదల చేసే 8,9 షట్టర్లు మరమ్మతులకు గురయ్యాయి. నీరు వృథాగా పోతుండడాన్ని అడ్డుకోనేలా తాత్కాలికంగా రూ.2.12 కోట్లతో షట్టర్లకు మరమ్మతులు చేపట్టారు. ఈ నేపథ్యంలో, మళ్లీ అదనంగా రూ.9.48 కోట్ల వ్యయంతో 16 షట్టర్లకు మరమ్మతులు చేపట్టనున్నారు.

కాంగ్రెస్ నేత మృతి వ్యవహారం

75 వేల సెల్ నెంబర్లపై పోలీసుల ఆరా

పెరంబూర్, జూన్ 10: తిరునల్వేలి తూర్పు జిల్లా అధ్యక్షుడు జయకుమార్ అనుమానాస్పద మృతిపై సీబీసీఐడీ పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ముమ్మరం చేశారు. జయకుమార్ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు సహా 20 మందిని విచారించారు. ఈ నేపథ్యంలో, మృతదేహం లభించిన తోటలో ఆధారం కోసం గాలించారు. అయితే ఇప్పటివరకు ఈ మృతికి సంబంధించి ఎలాంటి క్లూ లభించలేదు. ఈ నేపథ్యంలో, మృతదేహం లభించిన ప్రాంతంలో ఘటన జరిగిన రాత్రి నుంచి ఉదయం వరకు నమోదైన సెల్‌ఫోన్ నెంబర్ల జాబితాను సీబీసీఐడీ స్వాధీనం చేసుకుంది. అందులో సుమారు 75వేల ఫోన్ కాల్స్‌పై ఆరా తీస్తున్నారు. అనుమానాస్పద నెంబర్లపై సీబీసీఐడీ పోలీసులు విచారణ చేపట్టారు.

'నీట్' అవకతవకలపై నేడు కాంగ్రెస్ ధర్నా

పెరంబూర్, జూన్ 10: ఇటీవల విడుదలైన 'నీట్' ఫలితాల్లో అవకతవకలను నిరసిస్తూ కాంగ్రెస్ యువజన విభాగం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నారు. వళ్లువర్ కోట్టం మంగళవారం ఉదయం జరుగనున్న ధర్నా టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుందగై సహా పలువురు నాయకులు పాల్గొంటారని, ఈ కార్యక్రమంలో యువజన విభాగం సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొనాలని ఆ పార్టీ సోమవారం ప్రకటన విడుదల చేసింది.

రూ.11250 కోట్లతో కావేరి ప్రక్షాళన

● కేంద్ర జలవనరుల శాఖ అనుమతి



తిరుచ్చిలో కల్లనై డ్యామ్ నుంచి ప్రవహిస్తున్న కావేరి జలాలు

చెన్నై, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కావేరి నది, దాని ఉపనదులతో అనుసంధానంగా ఉన్న వందలాది నీటివనరులను మెరుగుపరిచే విధంగా. ప్రత్యేకించి వాటిలోని కాలుష్యాన్ని తొలగించడానికి రూ.11,250 కోట్లతో అమలు చేయనున్న 'నడందాయ్ వాళి కావేరి' పథకానికి కేంద్ర నీటివనరుల సంస్థ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ప్రవహించే కావేరి నదీ ప్రవాహంలో అద్దకం పరిశ్రమల నుంచి వెలువడే క్యాన్సర్ కారకాలైన కార్సినోజెన్, రోగనిరోధక శక్తిని నాశనం చేసే డయాక్సిన్ వంటి విష పదార్థాలు కలుస్తున్నాయి. ఈ నీటి కాలుష్యాన్ని నిరోధించేందుకు కావేరి నది, దానితో అనుసంధానంగా ఉన్న నీటివనరులను అభివృద్ధికి ఈ 'నడందాయ్ వాళి కావేరి' పేరుతో కొత్త పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే ప్రణాళికలను రూపొందించి కేంద్ర జల వనరుల శాఖ అనుమతికి పంపించింది. అయితే కేంద్ర జల వనరుల శాఖ సుదీర్ఘ కాలం ఈ ప్రాజెక్టు ప్రణాళికలకు అనుమతివ్వకుండా పెండింగ్‌లో ఉంచి ఇటీవలే తన ఆమోదాన్ని తెలియజేసింది. దీంతో రూ.11250 కోట్లతో ఈ పథకాన్ని అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతోనే ఈ పథకం అమలు చేయనుంది. గంగా నది ప్రక్షాళన పథకం లాగే కావేరి నది ప్రక్షాళన పథకం కూడా సత్ఫలితాలనిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. తొలి దశలో రూ. 1958 కోట్లతో పునర్నిర్మాణ పథకాన్ని మేట్టూరు నుంచి తిరుచ్చి వరకు, రెండో దశలో రూ. 8753 కోట్లతో తిరుచ్చి నుంచి కావేరి నది సముద్రంలో కలిసే ప్రాంతం వరకు ప్రక్షాళన పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ పథకాల అమలులో భాగంగా అద్దకపు పరిశ్రమల వ్యర్థాలు కలిసే ప్రాంతాలను గుర్తించి పది మురుగునీటి శుద్ధీకరణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇక మేట్టూరు నుంచి తిరుచ్చి వరకు 65 మురుగునీటి శుద్ధీకరణ కేంద్రాలు నెలకొల్పనున్నారు. ఇవిగాక భవానీ ఘాట్, కరూరు, కొడుముడి, మేట్టుపాళయం, మేట్టూరు, పళ్ళి పాళయం, సత్యమంగళం తదితర ప్రాంతాల్లో కావేరి నదికి ఇరువైపుల గట్లను పటిష్ఠం చేయనున్నారు. ఈ విషయమై రాష్ట్ర జల వనరుల శాఖ ఉన్నతాధికారి మాట్లాడుతూ కేంద్ర జల వనరుల శాఖ ఇటీవల నాగ్‌పూర్‌లో దక్షిణాది రాష్ట్రాల అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించిందని, ఆ సమావేశంలో పెండింగ్‌లో ఉన్న జల వివాదాలపై సమీక్ష చేశారన్నారు. ప్రస్తుతం 'నడందాయ్ వాళి కావేరి' పేరుతో కావేరి నదీ ప్రక్షాళన పథకానికి కేంద్ర జలవనరుల శాఖ అనుమతి మంజూరు చేయటంతో కేంద్రంలో కొత్తగా ఏర్పాటు కానున్న ఎన్డీయే ప్రభుత్వం ఈ ప్రాజెక్టు గురించి అధికారికంగా ఓ ప్రకటన విడుదల చేయనుందని చెప్పారు. ఆ తర్వాత ఈ పథకానికి సంబంధించి టెండర్లు జారీ చేయనున్నామని ఆయన వివరించారు.

పరందూర్ విమానాశ్రయానికి అదనపు స్థల సేకరణకు అనుమతి



చెన్నై, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా పరందూర్ విమానాశ్రయం కోసం అదనంగా 147.11 ఎకరాల సేకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అనుమతులిచ్చింది. చెన్నైలో రెండో విమానాశ్రయం కోసం కాంపరందూరులో 5,358 ఎకరాల్లో అతిపెద్ద విమానాశ్రయం నిర్మించేందుకు ఏర్పాట్లు జరుగుతున్న విషయం తెలిసిందే. దీని కోసం స్థల సేకరణ చురుగ్గా సాగుతోంది. ఈ నేపథ్యంలో తిరుపత్తూరు ఎడయార్‌పాక్కం గ్రామంలో అదనంగా 147.11 ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఇంతకు ముందే వళత్తూరు, తండలూరు, సింగిలిపాడి, అక్కంబాక్కం, ఏకనాపురం తదితర 12 గ్రామాల్లో భూమి స్వాధీనం చేసుకుని కొలతలు కూడా వేశారు. ఇప్పుడు తాజాగా నివాస, వ్యవసాయ భూముల్ని సేకరించేందుకు కూడా రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనికి సంబంధించే రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ వ్యవహారంపై ఏవైనా అభ్యంతరాలుంటే 30 రోజుల్లో తమను సంప్రదించాలని ప్రభుత్వం ప్రకటించింది. పరందూర్ విమానాశ్రయం కారణంగా తమ భూములు కోల్పోతున్నామంటూ అక్కడి రైతులు సుదీర్ఘకాలంగా నిరసన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే.

కన్నియాకుమారి తీరానికి పర్యాటకులకు నిషేధం

పెరంబూర్, జూన్ 10: ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రం కన్నియాకుమారి సముద్రతీరానికి సోమ, మంగళవారాల్లో పర్యాటకులకు నిషేధం విధించారు. సముద్రంలో ఏర్పడిన వాతావరణ మార్పుల కారణంగా బలమైన గాలులు వీస్తూ అలలు భారీగా ఎగసిపడుతున్నాయి. దీంతో, పర్యాటకుల భద్రతా దృష్ట్యా రెండు రోజులు కన్నియాకుమారి సముద్రతీరానికి నిషేధం విధిస్తూ జిల్లా యంత్రాంగం ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రాంతాల్లో విధులు చేపట్టిన పోలీసులు, పర్యాటకులు తీరప్రాంతానికి వెళ్లకుండా వెనక్కి పంపిస్తున్నారు.

త్వరలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ

పెరంబూర్, జూన్ 10: రాష్ట్రంలో త్వరలో కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు ఆహార వస్తువుల సరఫరా శాఖ తెలిపింది. రాష్ట్రంలో కొత్త రేషన్‌కార్డులు కోరుతూ సుమారు 2 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో, ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రెండు నెలలుగా దరఖాస్తుల పరిశీలనలో జాప్యం జరిగింది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ముగియడంతో, దరఖాస్తుల పరిశీలన చేపట్టినట్లు, త్వరలోనే అర్హులైన వారికి కొత్త రేషన్‌కార్డులు అందజేస్తామని ఆహార సరఫరా శాఖ అధికారులు తెలిపారు.

కోర్టుకు హాజరైన మాజీ మంత్రి అన్బళగన్

పెరంబూర్, జూన్ 10: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అన్నాడీఎంకే మాజీ మంత్రి కేపీ అన్బళగన్ సోమవారం కోర్టుకు హాజరయ్యారు. రూ.45.20 కోట్ల ఆస్తులు కూడబెట్టారని మాజీ మంత్రి కేపీ అన్బళగన్‌పై కేసు నమోదైంది. కేసులో అన్బగళన్ భార్య మల్లిక, కుమార్తెలు, బంధువులు అని మొత్తం 11 మందిని చేర్చారు. ఈ కేసుకు సంబంధించిన విచారణకు అన్బళగన్ సహా అందరూ ధర్మపురి జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టుకు హాజరు కాగా, తదుపరి విచారణ ఈ నెల 26వ తేదీకి వాయిదావేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

66 మందిపై గూండా చట్టం

చెన్నై, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గత రెండు వారాల్లో చెన్నైలో గూండా చట్టం కింద 66 మందిని అరెస్టు చేసినట్టు చెన్నై కమిషనరేట్ వర్గాలు తెలిపాయి. నగరంలో వరుసగా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై సందీప్ రాథోడ్ ఆదేశాల మేరకు గూండా చట్టం ప్రయోగిస్తున్న విషయం తెలిసిందే. జనవరి 1 నుంచి జూన్ 9వ తేదీ వరకు చెన్నైలో హత్యలు, దోపిడీలు, దొంగతనాలు, తదితర నేరాలకు పాల్పడిన 330 మంది నిందితులను, 111 మంది ఆర్థిక నేరస్థులు, గుట్కా తదితరాలను విక్రయించిన 21 మంది, వ్యభిచారం కేసులో 12 మంది, అత్యాచారం కేసులో నలుగురు చొప్పున మొత్తం 650 మందిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే వీరిలో వరుసగా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని పోలీసులు గుర్తించారు. వీరిలో 66 మంది వున్నట్లు తేలడంతో వారిపై గూండా చట్టం ప్రయోగించారు.

అన్నామలై-తమిళిసై అనుచరుల విమర్శల యుద్ధం

ప్యారీస్, జూన్ 10: రాష్ట్రంలోని పార్లమెంటు నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో కమలం పార్టీ చిత్తుగా ఓడిపోవడం ఆ పార్టీ కార్యకర్తలకు మింగుడు పడడం లేదు. బీజేపీని రాష్ట్రంలో బలపరిచింది ఎవరన్న దానిపై తాజాగా అన్నామలై, తమిళిసై అనుచరులు ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పిస్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై అహంకారం వల్లే అన్నాడీఎంకేతో కూటమి చెడిపోయిందని మాజీ సీనియర్ మంత్రులు ఆరోపిస్తున్నారు. ఈ విమర్శలను దక్షిణ చెన్నైలో పోటీచేసి ద్వితీయ స్థానంలో నిలిచిన డా.తమిళిసై కూడా సమర్థించారు. ఈ నేపథ్యంలో, బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిలో మార్పులుంటాయని కమలనాథులు ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉండగా, అన్నామలై-తమిళిసై అనుచరులు సోషల్ మీడియా వేదికగా పరస్పర విమర్శలు చేసుకుంటున్నారు.

బీజేపీలో చేరబోను : ఓపీఎస్ స్పష్టీకరణ



ప్యారీస్, జూన్ 10: తన శరీరంలో అన్నాడీఎంకే రక్తం ప్రవహిస్తోందని, ఎట్టి పరిస్థితుల్లోనూ తాను బీజేపీలో చేరబోనని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) స్పష్టం చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రమాణోత్సవ కార్యక్రమంలో ఓపీఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోదీ పదేళ్లలో దేశప్రజలందరికి మంచి పాలన అందించారని, ఏ రాష్ట్రంలోనూ కులమత ఘర్షణలు జరగలేదని, ఆయన అన్ని రాష్ట్రాలను సమానంగా చూసుకున్నారని తెలిపారు. దివంగత మాజీ ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత ప్రజలు మెచ్చే పాలన అందించి చరిత్రలో నిలిచిపోయారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్రంలో మళ్లీ అన్నాడీఎంకేను అధికారంలోకి తీసుకురావాలన్న సంకల్పంతో ఉన్నట్లు తెలిపారు. ప్రధాన రాజకీయపార్టీల అభ్యర్థులు పొందిన ఓట్ల కంటే రామనాథపురం పార్లమెంటు నియోజకవర్గ ఓటర్లు తనకు అండగా నిలిచి, 3.41 లక్షల ఓట్లు వేశారని, వారికి తాను సర్వదా రుణపడి ఉంటానన్నారు. చీలికలు ఏర్పడిన అన్నాడీఎంకేను ఒకటి చేయాలన్నదే తన ఏకైక లక్ష్యమని, అలాంటప్పుడు తాను బీజేపీలో చేరనున్నట్లు తానంటే గిట్టనివారు సాగిస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. తన నుంచి దూరమైన నాయకులు ఎక్కడున్నా బాగుండాలని ఓపీఎస్ తెలిపారు.

కరోనాతో మొదటి భర్త మృతి...

మరో వివాహమైన రోజే రెండో భర్త కూడా...!

ప్యారీస్, జూన్ 10: మొదటి భర్త కరోనా మహమ్మారికి బలవడంతో, మరో పెళ్లి చేసుకున్న రోజే రెండో భర్త కూడా మృతిచెందడం విషాదానికి దారితీసింది. తిరుచ్చికి చెందిన రాజ్యలక్ష్మి భర్త మూడేళ్ల క్రితం కరోనాతో మృతిచెందాడు. స్థానిక పెరవళ్లూర్ కేసీగార్డెన్ 6వ వీధికి చెందిన లోకేష్ (40)తో రాజ్యలక్ష్మి వివాహం జరిపించేందుకు రెండు కుటుంబాలు నిశ్చయించి తిరుపోరూర్‌లో ఉన్న సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం హిందు సంప్రదాయంలో పెళ్లి తంతు నిర్వహించారు. వివాహం అనంతరం వధూవరులు పెరవళ్లూర్‌లో ఉన్న వరుడి ఇంటికి చేరుకున్నారు. వారు గదిలో ఉన్న సమయంలో హఠాత్తుగా లోకేష్‌నురుగులు కక్కుతూ స్పృహ కోల్పోవడంతో బంధువులు ఆయనను వెంటనే కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ లోకేష్ పరిశీలించిన వైద్యులు, అప్పటికే మరణించినట్లు ధృవీకరించారు. దీనిపై తిరువికనగర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. పెళ్లి రోజే రెండవ భర్తను రాజ్యలక్ష్మి కోల్పోవడంతో ఆమె ఇంట విషాదం నెలకొంది.

రూ.64 కోట్లతో తిరువొత్తియూర్ హైరోడ్డు విస్తరణ

ప్యారీస్, జూన్ 10:ఉత్తర చెన్నైలో ప్రధాన రోడ్లలో ఒకటైన తిరువొత్తియూర్ హైరోడ్డును రూ.64 కోట్లతో విస్తరింపజేసేందుకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పథకం రూపొందించింది. తిరువొత్తియూర్‌హైరోడ్డులోని టోల్‌గేట్ నుంచి న్యూ వాషర్‌మెన్‌పేట వరకు 2.4కి.మీ దూరం రహదారిని ప్రపంచ బ్యాంక్ నిధుల సహకారంతో విదేశీస్థాయిలో తీర్చిదిద్దనున్నారు. ఈమార్గంలో వాటర్ ఫౌంటైన్లు, పిల్లల క్రీడా మైదానాలు, జిమ్, పార్కులు, లేజర్ షో తదితర వినోదభరిత అంశాలు ఏర్పాటుచేసేపథకానికి రాష్ట్రప్రభుత్వం అనుమతులు జారీచేసిందని, ప్రస్తుతం టెండర్లు ఆహ్వానించినట్లు కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

ఫ్రీజర్ బాక్స్‌లో విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

ప్యారీస్, జూన్ 10: తాత మృతదేహాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచిన ఫ్రీజర్ బాక్స్‌లో విద్యుత్ షాక్‌కు గురై మనవడు మృతిచెందిన సంఘటన పుదుకోట జిల్లాలో చోటుచేసుకుంది. గంధర్వకోట సమీపంలోని గోమాపురం గ్రామానికి చెందిన పరమశివం (80) వృద్ధాప్యం కారణంగా ఆదివారం మృతి చెందడంతో, ఆయన భౌతికకాయాన్ని ఫ్రీజర్ బాక్స్‌లో ఉంచి నివాళులర్పించారు. ఆదివారం సాయంత్రం అంత్యక్రియల కోసం ఫ్రీజర్ బాక్స్‌లో పరమశివం భౌతికకాయాన్ని మృతుడి మనుమడు విశాల్ (18) బయటకు తీస్తుండగా, విద్యుదాఘాతానికి గురై తాత మృతదేహంపై పడి మృతిచెందాడు. తాత మృతిచెందిన రోజే మనుమడు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఫర్నిచర్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం

ప్యారీస్, జూన్ 10: స్థానిక తిరుమిసై సమీపంలోని కోలప్పన్‌చేరిలో ఉన్న ఓ గోదాములో ఆదివారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో సుమారు రూ.1.5 కోట్ల మేర ఆస్తి నష్టం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ గోడౌన్‌లో ఇళ్లు, కార్యాలయాలకు అవసరమైన ఫర్నిచర్ భద్రపరచి, నగరంలోని పలు షోరూమ్‌లకు సరఫరా చేస్తుంటారు. పూందమల్లికి చెందిన ముత్తు మేనేజర్‌గా వ్యవహరిస్తున్న ఈగోడౌన్‌లో ఆదివారంసాయంత్రం 6.30గంటల సమయంలో హఠాత్తుగా మంటలు వ్యాపించడం గమనించిన సిబ్బంది కేకలేస్తూ బయటకు పరుగులు తీశారు. దీనిపై అందిన సమాచారంతో పూందమల్లి, గిండి, అంబత్తూర్, ఆవడి, కొరుక్కుపేట తదితర 12 ప్రాంతాల నుంచి ఫైరింజన్లతో వెళ్లిన అగ్నిమాపకసిబ్బంది, అర్ధరాత్రి 12.30గంటలకు మంటలు అదుపుచేశారు. ఈ ప్రమాదం వల్ల తిరుమిలిసై, పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగ అలుముకుంది. కేసు నమోదుచేసిన పోలీసులు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.

పంటలపై ఆగని ఏనుగుల దాడులు

మామిడి, టమోటా పంట, వరినారు ధ్వంసం

కల్లూరు, జూన్ 10: చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలంలో ప్రతి రోజూ ఏదో ఒక ప్రాంతంలో వ్యవసాయ పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలోని కమ్మపల్లి పంచాయతీలో రెండు రోజులుగా తిష్ట వేసిన ఏనుగుల గుంపు టమోటా, మామిడి, వరినారు ధ్వంసం చేయడంతో పంటలకు అపారనష్టం వాటిల్లింది. కమ్మపల్లిలోని మామిడితోటలోకి ఆదివారం రాత్రి ప్రవేశించిన ఏనుగుల గుంపు మామిడిచెట్లను ధ్వంసం చేసి పైపులను తొక్కేశాయి. దీంతో చెట్లకు ఉన్న మామిడికాయలు నేలరాలాయి. అనంతరం దేశిరెడ్డిగారిపల్లిలో టమోటా పంట, మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. కురవపల్లిలో వరినారును ధ్వంసం చేశాయి. పంటలపై సుమారు ఐదు ఏనుగుల గుంపు దాడి చేసినట్లు స్థానిక రైతులు తెలిపారు. బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మా పార్టీ అదృశ్యమవుతుందన్నారు

● ఇప్పుడు మీ పరిస్థితి ఏంటి?

● అన్నామలైని ప్రశ్నించిన జయకుమార్

చెన్నై, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల తరువాత అన్నాడీఎంకే అదృశ్యమవుతుందంటూ ప్రకటించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పరిస్థితి అయోమయంగా మారిందని మాజీ మంత్రి డి.జయకుమార్ ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన తిరుత్తణిలో విలేఖరులతో మాట్లాడుతూ... "బీజేపీ మతవాద రాజకీయాలను వీడాలి. ఆ పార్టీ వ్యవహారశైలికి ఉత్తరాది ప్రజలు సరైన గుణపాఠం చెప్పారు. ఎన్నికల ఫలితాలు రాకముందే తమకు 400 వస్తాయంటూ బీజేపీ నేతలు భుజాలు చరుచుకున్నారు. కానీ ఆ పార్టీ 240 వద్దే చతికిలబడింది. ప్రధానికి ముకుతాడు వేసినట్లయింది. దీంతో ఆయన స్వంతంత్రంగా నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితి నెలకొంది. జూన్ 4 తరువాత అన్నాడీఎంకే ఉండదంటూ జోస్యం చెప్పిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పరిస్థితి ఏమైందో అందరికీ అర్థమైంది" అని జయకుమార్ ఎద్దేవా చేశారు.

40 ఏళ్లు దాటితే మెడికల్ సర్టిఫికెట్ ఉండాల్సిందే ..!

డ్రైవింగ్ లైసెన్స్ కోసం కొత్త ఉత్తర్వులు

పెరంబూర్, జూన్ 10: ఇక నుంచి 40 ఏళ్ల పైబడిన వారు గుర్తింపు పొందిన వైద్యుడి నుంచి మెడికల్ సర్టిఫికెట్ పొందిన తర్వాతే, కొత్త డ్రైవింగ్ లైసెన్స్, పాత లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ తెలిపింది. ఈ విషయమై రాష్ట్ర రవాణా, రోడ్డు భద్రత కమిషనర్ జారీచేసిన ఉత్తర్వుల్లో.. కొత్త వాహన చట్టం నిబంధన ప్రకారం, 40 ఏళ్లకు పైబడిన వారు కొత్తగా డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు, పాత లైసెన్స్ రెన్యువల్‌కు మెడికల్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. తమిళనాడు వైద్య కౌన్సిల్‌లో నమోదుచేసుకున్న వైద్యుల నుంచి మాత్రమే 'సారథి' సాఫ్ట్‌వేర్ ఉపయోగించి దరఖాస్తుదారులు మెడికల్ సర్టిఫికెట్లను ఎలక్ట్రానిక్ మోడ్ ద్వారా మాత్రమే అప్‌లోడ్ చేయాలి. 'సారథి' సాఫ్ట్‌వేర్‌లో వైద్యులు తమ వివరాలు ఎలా నమోదుచేయాలి, వైద్య కౌన్సిల్‌లో తమసభ్యత్వాన్ని ఎలా ధ్రువీకరించాలి అనే ప్రక్రియను మంగళవారం ఉదయం 11 గంటలకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లా రవాణా అధికారుల ద్వారా వివరించనున్నట్లు తెలిపారు. ఈ విధానంతో నకిలీ సర్టిఫికెట్లను కూడా అడ్డుకొనే అవకాశముందని రవాణా శాఖ కమిషనర్ తెలిపారు.

విమానంలో ధూమపానం

యువకుడిని దించేసిన సిబ్బంది

పెరంబూర్, జూలై 10: విమానంలో ధూమపానం చేసిన రామనాథపురానికి చెందిన యువకుడిని అధికారులు విమానం నుంచి దింపివేశారు. చెన్నై నుంచి మలేసియాకు ఆదివారం రాత్రి 10 గంటలకు విమానం బయల్దేరడానికి ముందు ప్రయాణికులంతా తమ తమ సీట్లలో కూర్చొన్నారు. ఈ నేపథ్యంలో, రామనాథపురానికి చెందిన ఆర్ముగం తన సీట్లో కూర్చొని ధూమపానం చేస్తుండడాన్ని గమనించిన ఎయిర్‌హోస్టెస్, విమానంలో ధూమపానం చేయరాదని సూచించారు. ధూమపానం చేయకుండా తాను ఉండలేనని ఆర్ముగం భీష్మించుకోవడంతో విమాన సిబ్బంది అధికారులకు సమాచారమిచ్చారు. అధికారులతో విమానం దగ్గరకు చేరుకున్న పోలీసులు, విమానం నుంచి ఆర్ముగంను దించేశారు. ఈ కారణంగా గంట ఆలస్యంగా విమానం బయల్దేరి వెళ్లింది.

మహిళా కానిస్టేబుల్‌తో గొడవ: ఇద్దరు విద్యార్థుల అరెస్ట్

ప్యారీస్, జూన్ 10: స్థానిక కోయంబేడు ప్రాంతంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వన్‌వేలో మోటార్‌సైకిల్‌పై వెళ్లిన ఇద్దరు యువకులు తమను అడ్డుకున్న మహిళా కానిస్టేబుల్‌తో గొడవపడి అరెస్టయ్యారు. తిరువేర్కాడుకు చెందిన జయప్రియ కోయంబేడు ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఆమె కోయంబేడు కాళికాంబ ఆలయ సమీపంలో వన్‌వేలో డ్యూటీలో ఉన్న సమయంలో, అటుగా సెల్‌ఫోన్ మాట్లాడుతూ ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు యువకులను అడ్డుకున్నారు. ఆగ్రహించిన ఆ యువకులు ఆమెతో గొడవపడి, అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు సెల్‌ఫోన్‌లో ఆమె ఫొటో కూడా తీశారు. దానిపై జయప్రియ ఫిర్యాదు మేరకు ఆమెతో గొడవపడిన యువకుల కోసం గాలించి వారి జాడ తెలుసుకున్నారు. రెడ్‌హిల్స్‌కు చెందిన సెల్వకుమార్, అంబత్తూర్‌కు చెందిన జాక్విన్ అనే కళాశాల విద్యార్థులను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు.

విరుదునగర్‌లో ప్రభుత్వ బస్సు బోల్తా

మహిళ మృతి, 37 మందికి గాయాలు



బోల్తాపడిన బస్సు

ప్యారీస్, జూన్ 10: విరుదునగర్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున ప్రభుత్వ బస్సు బోల్తాపడిన ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందగా, 37 మందికి గాయాలయ్యాయి. కోయంబత్తూర్ నుంచి ఆదివారం రాత్రి 10 గంటలకు ప్రయాణికులతో కోవిల్‌పట్టికి బయల్దేరిన ప్రభుత్వ బస్సును కోవైకి చెందిన మురుగభూపతి నడిపారు. సోమవారం తెల్లవారుజామున విరుదునగర్-సాతూర్ నాలుగు రోడ్ల రహదారిలో వచ్చాకర్‌పట్టి ప్రాంతాన్ని చేరుకున్న సమయంలో రోడ్డు పక్కనున్న వంతెన గోడను ఢీకొంది. బస్సును అదుపుచేయాలని డ్రైవర్ చేసిన ప్రయత్నాలు విఫలమవడంతో సమీపంలో ఉన్న గొంతలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సహా 38 మందికి గాయాలవ్వగా, భువనేశ్వరి (33) అనే ప్రయాణికురాలు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం తెలిసి అక్కడకు చేరుకున్న పోలీసులు, క్షతగాత్రులను విరుదునగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై వచ్చకారపట్టి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

గ్రీవెన్స్ డేలో 365 వినతులు



ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, జూన్ 10: స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార శిబిరం జరిగింది. రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహించి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తుంటారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలుకు రావడంతో ఏప్రిల్ నుంచి గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిలిపివేశారు. ఓట్ల లెక్కింపుముగిసి ఫలితాలు వెలువడడంతో, ఎన్నికల కోడ్ రద్దయింది. ఈ నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్లపట్టాలు సహా 395 వినతులను ప్రజలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా పథక డైరెక్టర్ నాగరాజన్, జిల్లా రెవెన్యూ అధికారి రాజ్‌కుమార్, జిల్లా ఆదిద్రావిడులు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి సెల్వి, జిల్లా సివిల్ సప్లై అధికారి సుమతి సహా పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలకు వెళ్లిన కలెక్టర్, అక్కడ విద్యార్థుల ఆధార్ నమోదు ప్రక్రియను పరిశీలించారు.

బీజేపీ శ్రేణులు సంబరాలు



ప్రజలకు స్వీట్లు పంపిణీ చేస్తున్న కార్యకర్తలు

వేలూరు, జూన్ 10: దేశప్రధానిగా మూడో సారి పదవీ ప్రమాణం చేసిన నరేంద్ర మోదీని అభినందిస్తూ బీజేపీ శ్రేణులు సోమవారం నగరంలో సంబరాలు జరుపుకున్నారు. సత్తువాచేరి, కాట్పాడి, బాగాయం, తొరప్పాడి సహా పలు ప్రాంతాల్లో ఆ పార్టీ కార్యకర్తలు బాణాసంచా కాలుస్తూ, ప్రజలు మిఠాయిలు పంచిపెట్టారు. ప్రధాని మోదీ పాలనలో దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందని కార్యకర్తలు నినాదాలు చేశారు.

బక్రీద్ పండుగ ఎఫెక్ట్..

మడపట్టు సంతలో రూ. కోట్లలో పొట్టేళ్ల విక్రయం

చెన్నై, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగ సందర్భంగా మడపట్టు వారసంతలో రూ.5 కోట్ల మేరకు పొట్టేళ్ల విక్రయాలు జరిగాయి. విల్లుపురం జిల్లా మడపట్టులో ప్రతి ఆదివారం సంత జరుగుతుంది. ఇక్కడ విల్లుపురం జిల్లాలోని నలువైపుల ప్రాంతాల వారు పొట్టేళ్లు, కోళ్లు, ఆవులు, ఎద్దులను విక్రయిస్తుంటారు. ఇక్కడ పొట్టేళ్లు, కోళ్లను కొనుగోలు చేసేందుకు పుదుచ్చేరి, కడలూరు, కారైక్కాల్, చిదంబరం, తంజావూర్ తదితర ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఆ విధంగానే గత ఆదివారం కూడా సంత బిజీగా వుంది. ఈ నెల 17వ తేదీ బక్రీద్ సందర్భంగా పొట్టేళ్లను కొనుగోలు చేసేందుకు ఉదయం 5 గంటల నుంచే వ్యాపారులు తరలివచ్చారు. ఒక్కొక్క పొట్టేలు రూ.7 వేల నుంచి రూ.25 వేల వరకు ధర పలికింది. మొత్తమ్మీద రూ.5 కోట్ల మేరకు పొట్టేళ్ల విక్రయమైనట్లు వ్యాపారులు తెలిపారు.

రాష్ట్ర పోలీసు శాఖలో త్వరలో బదిలీలు

ప్యారీస్, జూన్ 10: ఎన్నికల నియమావళి రద్దయిన నేపథ్యంలో, రాష్ట్ర పోలీసు శాఖలో త్వరలోనే బదిలీలుంటాయని, దానికి సంబంధించిన జాబితా ముమ్మరంగా తయారవుతున్నట్లు డీజీపీ కార్యాలయ అధికారులు తెలిపారు. ఏప్రిల్ 19వ తేది రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరిగింది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన రోజు నుంచి పోలీసుశాఖలో పనిచేస్తున్న అధికారులు,సిబ్బందిని వారుపనిచేసిన ప్రాంతాలనుంచి ఇతర జిల్లాలకు ఎన్నికల కమిషన్ బదిలీ చేసింది. అందువల్ల కన్నియాకుమారికి చెందిన పోలీసు అధికారులు చెన్నై, ఆవడి, తాంబరం తదితర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. అదే విధంగా, తిరువళ్లూర్, తిరునల్వేలి, మదురై, సేలం తదితర జిల్లాలకు చెందిన పోలీసులు బదిలీకి గురయ్యారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్నికల నియమావళి ఎత్తేయడంతో పోలీసు శాఖలో బదిలీ చేయాల్సిన అధికారులు జాబితా తయారీని డీజీపీ వేగవంతం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మెట్రోపాలిటన్ నగరాలు, జిల్లాలకు చెందిన 1,016 మంది పోలీసు అధికారులు బదిలీ కోరుతూ దరఖాస్తు చేశారు. డీజీపీ, నగర పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, అసిస్టెంట్ పోలీసు కమిషనర్లు, ఏడీజీపీ సహా పలువురు బదిలీకి రంగం సిద్ధమైంది.

రాహుల్ కబాలి దర్శకత్వంలో 'భయమరియ బ్రహ్మై'



'భయమరియ బ్రహ్మై' ఫస్ట్‌లుక్

నూతన దర్శకుడు రాహుల్ కబాలి తెరకెక్కిస్తున్న చిత్రం 'భయమరియ బ్రహ్మై'. మూవీ ఫస్ట్‌లుక్ తాజాగా ప్రముఖ సినీ దర్శకుడు పా.రంజిత్ రిలీజ్ చేశారు. ఇది దర్శకుడి సృజనాత్మక ప్రతిభకు ప్రతిబింబంగా నిలిచిందని రంజిత్ వ్యాఖ్యానించారు. నూతన నటుడు జేడీ హీరోగా పరిచయమవుతున్నాడు. ఇతర పాత్రల్లో గురు సోమసుందరం, జాన్ విజయ్, హరీష్ ఉత్తమన్, వినోద్ సాగర్, విశ్వంత్, సాయి ప్రియాంక రుత్, దివ్య గణేష్, వినోద్ సాగర్, విశ్వనాథ్, హరీష్ తదితరులు నటించారు. కె సంగీతం స్వరాలు సమకూర్చగా, నందా, వి.ప్రవీణ్ కలిసి ఛాయాగ్రహణం అందించారు. ఈ క్రైమ్ థ్రిల్లర్ చిత్రాన్ని 69 ఎంఎం ఫిలింస్ పతాకంపై జగదీష్, రాహుల్ కబాలి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. చిత్రం గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'ఈ స్టోరీ 1990, 2000 సంవత్సరాల్లో జరుగుతుంది. అన్ని ప్రాంతాలకు ప్రాధాన్యత నిస్తూ స్క్రీన్‌ప్లే రూపొందించాం. క్రైమ్ థ్రిల్లర్ జానర్‌లో రూపొందిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేశాం. పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు జరుపుతున్నాం. త్వరలోనే ఆడియో, ట్రైలర్ విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని పేర్కొన్నారు. కాగా, ఈ సినిమాలోని పాత్రల రూపాన్ని డిఫరెంట్ లుక్‌లో డిజైన్ చేయడంతో ప్రేక్షకుల నుంచి విశేష స్పందన వస్తుంది.

చిత్రజ్యోతి

శంకర్ దర్శకత్వంలో అజిత్ చిత్రం?



శంకర్

అజిత్

సెన్సేషనల్ డైరెక్టర్ ఎస్.శంకర్ దర్శకత్వంలో అగ్రహీరో అజిత్ కుమార్ నటించనున్నట్టు కోలీవుడ్‌లో ప్రచారం జరుగుతుంది. ప్రస్తుతం వీరిద్దరూ తాము ముందుగా కమిట్ అయిన ప్రాజెక్టుల్లో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా కమల్ హాసన్ హీరోగా శంకర్ తెరకెక్కించిన 'ఇండియన్-2' వచ్చే నెలలో విడుదలకు సిద్ధమైంది. అలాగే, టాలీవుడ్ హీరో రామ్‌చరణ్ కథానాయకుడిగా 'గేమ్ ఛేంజర్' చిత్రాన్ని రూపొందిస్తున్నారు. అదేవిధంగా అజిత్ కుమార్ కూడా మగిళ్ తిరుమేని దర్శకత్వంలో 'విడా ముయర్చి', ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయిన తర్వాత వీరిద్దరి కలిసి పనిచేయబోతున్నారనే ప్రచారం కోడంబాక్కం వర్గాల్లో సాగుతుంది. ఇదే విషయంపై గత వారం అజిత్‌ను శంకర్ స్వయంగా కలిసి చర్చించినట్టు సమాచారం. కాగా, వీరిద్దరి కాంబినేషన్‌లో ఇప్పటివరకు ఒక్క చిత్రం కూడా రాలేదు. దీంతో ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చాలని అజిత్ ఫ్యాన్స్ బలంగా కోరుకుంటున్నారు.

గ్లామర్ ఎక్స్‌పోజింగ్‌తో రెచ్చిపోతున్న మాళవిక!

నటించిన చిత్రాలు వేళ్లపై లెక్కించే సంఖ్యలో ఉన్నప్పటికీ ఆ హీరోయిన్‌కు మాత్రం ఫ్యాన్స్ ఫాలోయింగ్ తగ్గడం లేదు. దీనికి కారణం గ్లామర్ ఎక్స్‌పోజింగ్. ఆమె పేరు మాళవిక మోహనన్. సూపర్‌స్టార్ రజినీకాంత్ నటించిన 'పేట' చిత్రంలో మీరా పాత్ర ద్వారా కోలీవుడ్ ప్రేక్షకులకు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత విజయ్ 'మాస్టర్', ధనుష్ 'మారన్' వంటి చిత్రాల్లో నటించింది. చియాన్ విక్రమ్‌తో కలిసి నటించిన 'తంగలాన్' విడుదలకు సిద్ధంగా ఉంది. అయితే, ఇప్పటివరకు మాళవిక నటించిన చిత్రాల్లో పెద్దగా ఎక్స్‌పోజ్ చేయకలేదు. కానీ, సోషల్ మీడియా వేదికగా ఆమె రెచ్చిపోతోంది. స్పెషల్ ఫొటో షూట్‌లు చేసి వాటిని సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటుంది. ఈ కోవలోనే ఆమె తాజాగా షేర్ చేసిన ఫొటోలు అభిమానులను, నెటిజన్లను ఫిదా చేస్తున్నాయి.



మాళవిక మోహనన్

ప్రపంచం ఆశ్చర్యపోయేలా దేశాన్ని తీర్చిదిద్దాలి

● ప్రధాని మోదీకి మాధవన్ విసెష్



ప్రధాని మోదీతో ఆర్.మాధవన్

దేశ ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోదీకి కోలీవుడ్ హీరో, సినీ దర్శకుడు, నిర్మాత ఆర్.మాధవన్ శుభాకాంక్షలు తెలిపారు. ఇదే విషయంపై ఆయన తన ఇన్‌స్టా ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. 'దేశ ప్రధానిగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేసినందుకు నరేంద్ర మోదీకి అభినందనలు, శుభాకాంక్షలు. 'వసుధైక కుటుంబం' అనే సూక్తిని ఆదర్శంగా తీసుకుని ప్రజలపై ప్రేమ, కరుణాకటాక్షాలు, దయ చూపుతూ, దేశం అపారమైన అభివృద్ధి, పురోగతి సాధించేలా పాలన చేయాలని, ముఖ్యంగా, ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోయేలా, ప్రతి ఒక్కరూ గర్వించదగినరీతిలో భారతదేశాన్ని తీర్చిదిద్దాలని కోరుకుంటున్నాను. అదేసమయంలో మీరు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని, ఈ గొప్పదేశం భవిష్యత్ కోసం దేవుని ప్రార్థిస్తాను' అని పేర్కొన్నారు.

తెరుచుకున్న బడులు..



'బడికి వెళ్లాలా' అంటూ దీనంగా చూస్తున్న బాలుడు



తరగతి గదిలో చిన్నారుల ఆనందహేల



కొత్త పాఠ్యపుస్తకాలతో విద్యార్థులు



పిల్లలను బలవంతంగా బడికి తీసుకెళ్తున్న తల్లి



'నేనింటి పోతా' అంటున్న చిన్నారి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం పాఠశాలలు తెరుచుకున్నాయి. విద్యార్థులు సంతోషంగా బడులకు వచ్చారు. చిన్నపిల్లలు బడికి వెళ్లమని మారాం చేస్తుండగా.. కొన్ని చోట్ల బడికి వచ్చిన చిన్నారులు సరదాగా ఆడుతూ సందడి చేశారు.

- పెరంబూర్



తరగతి గదిలో విద్యార్థుల ప్రార్థన

లండన్ నుంచి తిరిగొచ్చిన మంత్రి ఉదయనిధి



దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి మైనపు విగ్రహం వద్ద మంత్రి ఉదయనిధి

ప్యారీస్, జూన్ 10: రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి లండన్ పర్యటన ముగించుకొని ఆదివారం రాత్రి నగరానికి తిరిగొచ్చారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ అనంతరం మే నెలలో ఉదయనిధి పది రోజుల పర్యటనకు లండన్ వెళ్లారు. ఆ తర్వాత ఈ నెల 4వ తేది మళ్లీ లండన్‌కు వెళ్లిన ఆయన ఐదు రోజులు అక్కడే ఉండి నగరానికి తిరిగొచ్చారు. సోమవారం ఉదయం ప్యారీస్‌లోని అన్నామలై హాలులో దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి ముగింపు వేడుకల సందర్భంగా ఆయన జీవితచరిత్రకు సంబంధించి ఏర్పాటుచేసిన ఫొటో ప్రదర్శనను మంత్రి ఉదయనిధి వీక్షించారు. ఆ ప్రదర్శన ఏర్పాటుచేసిన హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్ బాబును అభినందించారు.

ఊటీ మున్సిపాలిటీకి కార్పొరేషన్ హోదా



ఊటీ మున్సిపాలిటీ కార్యాలయం

ప్యారీస్, జూన్ 10: నీలగిరి జిల్లాలోని ఊటీ మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. వేసవి విడిది కేంద్రంగా పేరుగాంచిన ఊటీలో ఆహ్లాదకరమైన చల్లటి వాతావరణం, రమ్యమైన ప్రకృతి అందాలు వీక్షించేందుకు దేశంలోని పలు రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుంచి పర్యాటకులు పెద్దసంఖ్యలో వస్తున్న విషయం తెలిసిందే. ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి పరిచి, పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పించాలని ఊటీ మున్సిపాలిటీ నిర్ణయించింది. మున్సిపల్ ఛైర్మెన్ వాణీశ్వరి నేతృత్వంలో సోమవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. 36 వార్డులతో స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా 1987వ సంవత్సరం నుంచి ఈ మున్సిపాలిటీ పనిచేస్తోంది. ఈ ప్రాంతంలో రాజ్‌భవన్, బొటానికల్ గార్డెన్, రోజ్ గార్డెన్, బోట్ హౌస్, ఆదివాసీల మ్యూజియం, తొట్టబెట్ట కొండ శిఖరం తదితరాలున్నాయి. అందువల్ల ఊటీ మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా అభివృద్ధి పరిచే అధికారపూర్వక ప్రకటన ప్రభుత్వం వెల్లడిస్తుందని వాణీశ్వరి మీడియాకు తెలిపారు.

డీఎంకే విజయోత్సవానికి భారీ ఏర్పాట్లు

● మంత్రి ముత్తుస్వామి



ప్యారీస్, జూన్ 10: కోవై కొడీసియా గ్రౌండ్‌లో కోలాహలంగా నిర్వహించనున్న డీఎంకే విజయోత్సవానికి భారీ ఏర్పాట్లు చేపట్టినట్లు రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రి ఎస్.ముత్తుస్వామి పేర్కొన్నారు. 18వ లోక్‌సభకు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో డీఎంకే, మిత్రపక్షాలు ఘనవిజయం సాధించాయి. తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో ఉన్న 40 నియోజకవర్గాల్లో గెలిచిన ఎంపీలను సన్మానించేందుకు డీఎంకే అధిష్ఠానం నిర్ణయించింది. ఇందుకోసం కోవై కొడీసియా గ్రౌండ్‌లో ఈ నెల 15న నిర్వహించనున్న విజయోత్సవానికి సంబంధించిన వేదిక ఏర్పాటు పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఏర్పాట్ల గురించి మంత్రి ముత్తుస్వామి మీడియాతో మాట్లాడుతూ... దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి ముగింపు వేడుకలు, డీఎంకే కూటమికి ఓటేసి గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేయడం, ఎన్నికల్లో గెలిచిన ఎంపీలందర్నీ ఈ విజయోత్సవ వేడుకల్లో ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ అనుమతితో చేపట్టిన పనులను సకాలంలో పూర్తిచేయనున్నట్లు మంత్రి తెలిపారు.


ప్రభుత్వ కళాశాలల్లో జనరల్ కౌన్సెలింగ్ ప్రారంభం



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థినులు

చెన్నై, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లో డిగ్రీ మొదటి సంవత్సరానికి సంబంధించిన కౌన్సెలింగ్ ప్రారంభమైంది. దీనికి సంబంధించిన దరఖాస్తు స్వీకరణ మే 5 నుంచి 24వ తేదీ వరకు జరిగిన విషయం తెలిసిందే. ఆయా కళాశాలల్లో చేరేందుకు ఔత్సాహికులు ప్రభుత్వ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నారు. మరికొంతమంది నేరుగా దరఖాస్తులు కళాశాలల్లోనే ఇచ్చారు. తమిళనాడులోని 164 ఆర్ట్స్ కళాశాలల్లో యూజీలో చేరేందుకు 2,58,527 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 2,11,010 మంది అడ్మిషన్ ఫీజు కట్టారు. స్పెషల్ కోటా కౌన్సెలింగ్ మే 28-30 తేదీల మధ్య ఆయా కళాశాలల్లో జరిగింది. ఇందులో క్రీడలు, మాజీ సైన్యాధికారుల పిల్లల కోసం కౌన్సెలింగ్ జరిగింది. ఈ నేపథ్యంలో సాధారణ కౌన్సెలింగ్ సోమవారం ప్రారంభమైంది. ఇందులో ర్యాంకుల వారీగా ఆహ్వానం అందుకున్న విద్యార్థులు పాల్గొన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు ఈ కౌన్సెలింగ్ కొనసాగనుంది. అనంతరం రెండో విడత కౌన్సెలింగ్ జూన్ 24 నుంచి 29 వరకు కొనసాగనుంది. మొదటి సంవత్సరం విద్యార్థులకు జూలై 3వ తేదీన తరగతులు ప్రారంభం కానున్నాయి.


కుత్రాలం జలపాతాల్లో జలకళ



కుత్రాలం ప్రధాన జలపాతం వద్ద ఉధృతంగా పడుతున్న నీరు

చెన్నై, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా పడమటి పర్వత కనుమల్లో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ చెదురుమదురుగా వర్షాలు కురవటంతో కుత్రాలంలోని ఐందరువి, ప్రధాన జలపాతంలో హఠాత్తుగా నీటి ప్రవాహం పెరిగింది. సాయంత్రం ఆ జలపాతాలలో నీటి ఉధృతి తగ్గగానే పర్యాటకులను స్నానానికి అనుమతించారు. ఆ తర్వాత శనివారం రాత్రి కురిసిన కుండపోత వర్షాలకు ఆదివారం ఉదయం మళ్ళీ కుత్రాలం జలపాతాల వద్ద నీరు ఉధృతంగా పడుతుండటంతో పర్యాటకులను స్నానానికి అధికారులు నిషేధం విధించారు. ఆ ప్రాంతంలో ఎవరూ స్నానం చేయకుండా పోలీసులు కాపలా కాస్తున్నారు. ప్రధాన జలపాతం మినహా తక్కిన నాలుగు జలపాతాలలో నీటి ఉధృతి తగ్గటంతో పర్యాటకులను స్నానానికి అనుమతించారు.

హొగెనేకల్‌లో పర్యాటకుల సందడి



దోనెల సవారీలో పర్యాటకులు

పెరంబూర్, జూన్ 10: ప్రముఖ పర్యాటక కేంద్రం హొగెనేకల్ ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. కర్ణాటక డ్యాంల నుంచి విడుదల చేసే కావేరి జలాలు, కావేరి పరీవాహక ప్రాంతాల నుంచి వచ్చే నీరు హొగెనేకల్‌లో కావేరి నది మీదుగా మేట్టూరు డ్యాంకు చేరకుంటాయి. హొగెనేకల్ వద్ద కావేని నది రెండు కొండల మధ్య ప్రవహిస్తోంది. తొలుత నది నుంచి కొండల మీదుగా వచ్చే ప్రవాహం కొండల మధ్యలో చేరుకొని ప్రవహిస్తుంది. ఈ రమణీయమైన దృశ్యాలు వీక్షించేందుకు పర్యాటకులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. పర్యాటకుల కోసం ఎత్తైన కొండ మధ్యలోని నదిలో దోనెల సవారీ ఉంది. ఆదివారం సెలవు కావడం, హొగెనేకల్ జలపాతం వద్ద నీరు 1,500 ఘనపుటడుగులు మాత్రమే ఉండడంతో, అధిక దోనెలను నడిపారు. దీంతో దోనెల సవారీ చేస్తూ పర్యాటకులు ఉత్సాహంగా గడిపారు.

20 నుంచి శశికళ రాష్ట్ర పర్యటన



చెన్నై, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే భారీ ఓటమిని చవిచూసిన నేపథ్యంలో ఆ పార్టీ బహిష్కృత నేత వీకే శశికళ దక్షిణాది జిల్లాల్లో పర్యటించాలని నిర్ణయించారు. ఆ మేరకు ఈ నెల 20 నుంచి ఆమె పలు ప్రాంతాలను పర్యటించనున్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే బోణీ కొట్టని విషయం తెలిసిందే. దీంతో ఆ పార్టీ అధినేత ఎడప్పాడి పళనిస్వామిపై వరుస విమర్శలు రేగుతున్నాయి. ఇదే అదనుగా భావించిన శశికళ పార్టీలోని అసంతుష్టులను దరి చేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా ఆమె పరాజితులకు ఓదార్పు పేరుతో ఈ నెల 20వ తేదీ నుంచి పలు ప్రాంతాల్లో పర్యటించనున్నారు. ఇప్పటికే ఆమె పార్టీ నేతలంతా ఏకమవ్వాలని పిలుపునిస్తున్న విషయం తెలిసిందే. బహిష్కృతులైన తనతో పాటు ఓపీఎస్, దినకరన్ తదితరులందరినీ అన్నాడీఎంకేలో చేర్చుకుని, పార్టీని, బలోపేతానికి కృషి చేయాలని శశికళ గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

6 నెలల పసికందుకు కాలేయ మార్పిడి



మీడియా సమావేశంలో వైద్యులు

చెన్నై, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భుటాన్‌కు చెందిన ఆరు నెలల పసికందుకు గ్లెనెగల్స్ హెల్త్‌సిటీ వైద్యులు కాలేయ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. తల్లి కాలేయాన్నే ఆ పసికందుకు అమర్చారు. సోమవారం ఆస్పత్రి ప్రాంగణంలో జరిగిన విలేఖరుల సమావేశంలో పాల్గొన్న డాక్టర్ జాయ్ వర్గీస్, డాక్టర్ సోమశేఖర, డాక్టర్ నగేష్ కె.రావ్, డాక్టర్ రజనీకాంత్, డాక్టర్ సెల్వకుమార్ మల్లీశ్వరన్ తదితరులు ఈ వివరాలను వెల్లడించారు. పుట్టుకతోనే కాలేయ సమస్యతో బాధపడుతున్న చిన్నారిని పలుఆస్పత్రులకు తిప్పినా ఫలితం లేకపోయిందని, దాంతో బాధితులు తమ వద్దకు వచ్చారన్నారు. తాము ఆ చిన్నారికి విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించి కాలేయ మార్పిడి చేపట్టినట్లు వివరించారు.

ఘనంగా కాపు వివాహ పరిచయ వేదిక



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జగన్మోహనరావు

చెన్నై, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కాపు సేవా సమితి ఆధ్వర్యంలో కాపు వివాహ పరిచయ వేదిక ఆదివారం నగరంలో జరిగింది. స్థానిక టి.నగర్ విజయరాఘవరోడ్డులోని ఆంధ్రా క్లబ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కాపు, బలిజ, తెలగ సామాజిక వర్గాల వారి కల్యాణ వేదిక ఘనంగా నిర్వహించారు. 70 మంది యువతీయువకులకు చెందిన కుటుంబాలు ఈ వేదికలో పాల్గొన్నాయి. కార్యక్రమంలో ముత్యాల వాణిజ్యవేత్త కొట్టే నారాయణ, కళాసుధ తెలుగు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బేతిరెడ్డి శ్రీనివాస్ అతిథులుగా హాజరయ్యారు. కాపు సేవా సమితి అధ్యక్షులు గూడపాటి జగన్మోహనరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.